సాక్షి అనకాపల్లి

ఆదివారం । 19 । ఫిబ్రవరి । 2023



నూకతాత పండగ

రాజయ్యపేట నూకతాత పండగను రెండు రోజులపాటు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. 8లో



విశాఖ డీఆర్‌ఎం తనిఖీలు

విశాఖ: విశాఖ–కోరాపుట్ సెక్షన్‌లో గూడ్స్ పట్టాలు తప్పిన ప్రాంతాన్ని డీఆర్‌ఎం అనూప్ కుమార్ సత్పతి శనివారం తనిఖీ చేశారు.



పరిశుభ్రమైన బీచ్‌లే లక్ష్యం

విశాఖ: నేవీ అధికారులు శనివారం యారాడ, ఆర్కే, భీమిలి బీచ్‌లలో చెత్తాచెదారాన్ని తొలగించారు.

న్యూస్‌రీల్

కళ్యాణపులోవ, పుణ్యగిరికి ప్రత్యేక బస్సులు

అనకాపల్లి టౌన్: మహాశివరాత్రి సందర్భంగా ఆదివారం తెల్లవారుజామున అనకాపల్లి డిపో నుంచి కళ్యాణపులోవ, పుణ్యగిరిలకు 50 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ఎస్.సుజాత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు సాధారణ చార్జీలతోనే ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు చెప్పారు. బస్ బుక్ చేసుకున్న భక్తులకు ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చామన్నారు.

వడ్డాది కస్పా గ్రోయిన్ పనులు వేగవంతం



కస్పా గ్రోయిన్ పనులను పరిశీలిస్తున్న విశాఖ డెయిరీ చైర్మన్ ఆనంద్‌కుమార్

బుచ్చెయ్యపేట: వడ్డాది కస్పా గ్రోయిన్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ తెలిపారు. విశాఖ డెయిరీ మంజూరు చేసిన రూ.80 లక్షలతో చేపడుతున్న ఈ పనులు తుది దశకు చేరుకున్నారు. శనివారం ఆయన గ్రోయిన్ నిర్మాణ పనులను పరిశీలించారు. అంతకు ముందు కోమళ్లపూడిలో శివపార్వతుల విగ్రహాల ప్రతిష్ఠకు శంకుస్థాపన చేశారు. విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యానారాయణ, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కొల్లిమెల్ల అచ్చింనాయుడు, మాజీ వైస్ ఎంపీపీ దాడి సూర్యనాగేశ్వరరావు, కాపు సంఘం మండలాధ్యక్షుడు ఎం.అప్పారావు పాల్గొన్నారు.

వాహన చోదకులపై 390 కేసులు నమోదు

రూ.79,300 జరిమానా వసూలు

అనకాపల్లి టౌన్: జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం మద్యం, ఇసుక, గంజాయి, పశువుల అక్రమ రవాణా, కోడిపందాలు, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలపై దాడులు నిర్వహించినట్టు ఎస్పీ గౌతమి సాలి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంవీ చట్టాన్ని ఉల్లంఘించిన వాహన చోదకులపై 390 కేసులు నమోదు చేసి రూ.79,300ల జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. కోడిపందాలు ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.2,370లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. సెబ్ అధికారులు దాడులు నిర్వహించి 7 కేసులు నమోదు చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారని, 300 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేసి, 26 లీటర్ల నాటు సారా, ఒక లీటర్ అక్రమ మద్యంను స్వాధీనం చేసుకున్నారని ఆమె చెప్పారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి ప్రజాశాంతికి ఆటంకం కలిగించిన 30మందిపై, మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 16మందిపై కేసులు పెట్టామన్నారు.

23న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

మహారాణిపేట: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఎన్నికల కమిషన్ అనుమతి ఇచ్చింది. ఈనెల 23న మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షత సమావేశం నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. వచ్చే నెల 13న ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో సమావేశ నిర్వహణపై ఇటీవల జిల్లా పరిషత్ సీఈవో శ్రీరామ్మూర్తి ఎన్నికల కమిషన్‌కు లేఖ రాశారు. గతంలో సర్వ సభ్య సమావేశం నిర్వహించి 90 రోజులు పూర్తి కావడంతో ఈనెల 23న సమావేశం నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ షరతులతో అనుమతి ఇచ్చింది. తీర్మానాలు, అభివృద్ధి పనుల ప్రతిపాదనలు పెట్టరాదని పేర్కొంది. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

హరహర మహాదేవ

లయకారుడు.. కోరిన కోర్కెలు తీర్చే భోళా శంకరుడు.. కష్టాలను దిగమింగి, వరాలు కురిపించే గరళకంఠుడు అయిన పరమేశ్వరుని దర్శనానికి భక్తజనం తరలివచ్చింది.. మహాశివరాత్రి పర్వదినాన అభిషేకప్రియుడి అర్చనలతో ఆలయాలు కిటకిటలాడాయి. అర్ధరాత్రి లింగోద్భవ కాలంలో శివనామస్మరణతో ఆధ్యాత్మికత పరవళ్లు తొక్కింది.



కళ్యాణపులోవ రేవులో భక్తుల పుణ్య స్నానాలు

- పంచాక్షరితో మార్మోగిన శివాలయాలు
- ఘనంగా మహాశివరాత్రి పర్వదినం
- లింగోద్భవంతో భక్తుల పరవశం

రావికమతం/రాంబిల్లి/నర్సీపట్నం/చోడవరం: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శనివారం వేకువజాము నుంచే శివాలయాల్లో పూజలు ప్రారంభమయ్యాయి. పంచామృతాలతో అభిషేకించి పువ్వులతో అలంకరించి భక్తులు మురిసిపోయారు. ప్రముఖ శైవక్షేత్రమైన కళ్యాణపులోవ తిరునాళ్లకు భక్తులు, యాత్రికులు పెద్దఎత్తున తరలివచ్చారు. హరహర మహాదేవ శంభోశంకర అంటూ శివనామస్మరణ చేశారు. సుమారు 90 వేల మంది యాత్రికులు పోతురాజుబాబును దర్శించుకున్నారని దేవదాయ శాఖ అధికారులు చెప్పారు. డీసీసీబీ చైర్‌పర్సన్ చింతకాయల అనిత, సీఈవో డీవీఎస్ వర్మ, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్ పాడి పోతురాజు, ఈవో మురళీకృష్ణ ప్రత్యేక సేవలు అందించారు.



కళ్యాణపులోవలో డీసీసీబీ చైర్‌పర్సన్ అనిత



ఉత్తర వాహినిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

పంచదార్లకు పోటెత్తిన భక్తులు

జిల్లాలో ప్రముఖ శైవక్షేత్రం పంచదార్లకు భక్తజనం పోటెత్తారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా నలుమూలల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. తొలుత పవిత్రమైన ఆకాశధార వద్ద పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు ఉమా ధర్మలింగేశ్వరస్వామి, కాశీ విశ్వేశ్వరస్వామి వార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో సాంబశివరావు, ఉత్సవ కమిటీ కన్వీనర్ ముత్తా సూరిబాబు పర్యవేక్షించారు. సీఐ గఫూర్, ఎస్‌ఐ దీనబంధుతోపాటు పోలీసు సిబ్బంది, సచివాలయ మహిళా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. దిమిలి పీహెచ్‌సీ వైద్య విభాగం ఇక్కడ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసింది.



ఎం.కోడూరు కాశీవిశ్వేశ్వరాలయంలో ఉత్సవ విగ్రహాలతో డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు



విద్యుద్దీపాల కాంతుల్లో చోడవరం స్వయంభూ గౌరీశ్వరుడి ఆలయ ప్రాంగణం

ఉత్తరవాహినిలో శివనామస్మరణ

నర్సీపట్నం బలిఘట్టం ఉత్తరవాహిని నదీ ఒడ్డున త్రిశూల పర్వతంపై వెలసిన బ్రహ్మలింగేశ్వర స్వామిని భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. ఉత్తర వాహిని నదీలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామికి పూజలు చేశారు. రాత్రి స్వామికి లింగోద్భవకాల మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, కల్యాణోత్సవం నిర్వహించారు. పాకలపాడు గురుదేవుల ఆశ్రమంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. చోడవరం స్వయంభూ గౌరీశ్వరాలయంతో పాటు మూడు నదులు కలిసే ముద్దుర్తి సంగమేశ్వరాలయం, జుత్తాడలో స్ఫటిక లింగేశ్వరస్వామి, ఐదు నందులతో శోభిల్లే గవరవరం శివాలయం, 300 ఏళ్ల చరిత్ర ఉన్న వెంకన్నపాలెం భోగలింగేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.



పంచదార్లలో ఉమా ధర్మలింగేశ్వరస్వామి

శంకరమఠంలో టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి పూజలు

సీతంపేట: కంచికామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామి జన్మదినం కావడంతో టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి శనివారం శంకరమఠానికి విచ్చేశారు. స్వామివారిని దర్శించి, అక్కడ యాగశాలలో జరుగుతున్న పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తిరుపతి ప్రసాదాన్ని స్వామివారికి అందజేసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఆయనతో రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సీతంరాజు సుధాకర్, వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త కె.కె.రాజు ఉన్నారు.



శంకర విజయేంద్ర సరస్వతి స్వామి వారికి తిరుపతి ప్రసాదం అందజేస్తున్న టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి

'సిరివెన్నెల' పాటలు మేల్కొలిపే దివిటీలు



ఉత్తమ ఉపాధ్యాయుడు కాండ్రేగుల అప్పారావును సత్కరిస్తున్న ఎమ్మెల్సీ మాధవ్



కశింకోటలో పుస్తకావిష్కరణ

- చెంబోలు శ్రీరామశాస్త్రి
- 'అక్షర యోధుడు సిరివెన్నెల సీతారామశాస్త్రి' పుస్తకావిష్కరణ

కశింకోట: దివంగత సినీ పాటల రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి దివిటీల్లాంటి పాటలు రాసి సమాజాన్ని మేలుకొల్పడానికి ప్రయత్నించారని సీతారామశాస్త్రి సోదరుడు చెంబోలు శ్రీరామశాస్త్రి అన్నారు. కశింకోటలోని పీఏసీఎస్ వద్ద కల్యాణ మండపంలో ద్వారపురెడ్డి నూకరాజు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 'అక్షర యోధుడు సిరివెన్నెల సీతారామశాస్త్రి' పేరిట స్థానిక కవి గూటూరి వెంకటేశ్వరరావు రచించిన పుస్తకం ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. సీతారామశాస్త్రి గేయ రచయిత కావడానికి కారకుడైన అతని గురువు ఎర్రంశెట్టి సత్యారావు మాస్టార్ చేతుల మీదుగా పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో శ్రీరామశాస్త్రి మాట్లాడుతూ సినిమా కథ పూర్తిగా విన్న తర్వాతే కథలో ఒదిగిపోయే విధంగా సీతారామశాస్త్రి పాటలు రాసేవారన్నారు. అందుకే అవి ప్రజల హృదయాల్లో హత్తుకుపోయాయన్నారు. సీతారామశాస్త్రి గురువు విశాఖపట్నం బీవీకే కళాశాల రిటైర్డు ప్రిన్సిపాల్ సత్యారావు మాస్టార్ మాట్లాడుతూ దేశం, సమాజం సుభిక్షంగా ఉండాలనే సంకల్పంతో శాస్త్రి సినీ పాటల రచనను చివరి వరకు కొనసాగించారన్నారు. సమాజాన్ని మేలుకొలిపే విధంగా ఆయన పాటల రచన సాగించారన్నారు.

పుస్తక రచయిత గూటూరి మాట్లాడుతూ తెలుగు సాహిత్యంతో అద్భుతమైన పాటలు రాసి ప్రజల నుంచి విశేష ఆదరాభిమానాలు పొందారని కొనియాడారు.

ఉత్తమ ఉపాధ్యాయునికి సత్కారం

ఉత్తమ ఉపాధ్యాయునిగా చారిటబుల్ ట్రస్టు తరపున కాండ్రేగుల అప్పారావును ఎమ్మెల్సీ పి.వి. మాధవ్ దుశ్శాలువా కప్పి జ్ఞాపికను అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తండ్రి ద్వారపురెడ్డి నూకరాజు పేరిట ట్రస్టు ఏర్పాటు చేసి తనయునిగా పరమేశ్వరరావు పలు సేవా కార్యక్రమాలను అమలు చేస్తుండడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ విద్యార్థులకు పారితోషికాన్ని అందజేశారు. ముందుగా మాజీ సర్పంచ్ నూకరాజు విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా వైజ్ఞానిక ప్రదర్శన

- జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ
- ఈ నెల 22, 23 తేదీల్లో ప్రదర్శనలు
- అనకాపల్లి జీవీఎంసీ హైస్కూల్ (మెయిన్)లో నిర్వహణ

సాక్షి, అనకాపల్లి : జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా అనకాపల్లిలో జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ తెలిపారు. ఈ నెల 22, 23 తేదీల్లో జీవీఎంసీ ఉన్నత పాఠశాల (మెయిన్)లో నిర్వహించనున్న ఈ కార్యక్రమం ఏర్పాట్లపై శనివారం ఉన్నత స్థాయి అధికారులు, నిర్వహణ కమిటీల సభ్యులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా ఏర్పడిన తర్వాత మొట్టమొదటి సారిగా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహిస్తున్నందున పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆమె సూచించారు. విద్యార్థులకు సౌకర్యాల కల్పనలో ఎటువంటి సమస్యలు లేకుండా చూసుకోవాలన్నారు.

ప్రదర్శనలకు అవసరమైన గదుల కేటాయింపు, వేదిక ఏర్పాటు, పరిసరాలను అందంగా తీర్చిదిద్దడంతో పాటు భోజన సదుపాయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఏర్పాట్లపై జిల్లా ఉపవిద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్.ప్రేమ్‌కుమార్, ఏడీ రవిబాబు, జిల్లా సైన్స్ ఆఫీసర్ కె.ప్రసాద్‌లతో ఆమె చర్చించారు. ఈ సమావేశంలో డీవైఈవో ఎన్.ప్రేమ్‌కుమార్, ఏడీ రవిబాబు నిర్వహణ కమిటీలు అనుసరించాల్సిన విధివిధానాలను వివరించారు. కార్యక్రమంలో కశింకోట ఎంఈవో చిట్టిబాబు, అనకాపల్లి ఎంఈవో దివాకర్, జిల్లా సైన్స్ ఆఫీసర్ కప్పల ప్రసాద్, హెచ్‌ఎంలు, నిర్వహణ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

ఐదు విభాగాల్లో 120 ప్రాజెక్టులు

జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని అనకాపల్లిలో నిర్వహించనున్న జిల్లా విద్యావైజ్ఞానిక ప్రదర్శనకు సంబంధించి ఐదు విభాగాల్లో 120 ప్రాజెక్టులను ఎంపిక చేశారు. ఎకో ఫ్రెండ్లీ మెటీరియల్స్, హెల్త్ అండ్ క్లీన్లీనెస్, సాఫ్ట్‌వేర్ అండ్ యాప్స్, ఎన్విరాన్‌మెంట్ అండ్ క్లైమేట్ చేంజ్, మేథమెటికల్ మోడలింగ్ విభాగాల్లో 24 ప్రాజెక్టుల చొప్పున జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యాయి. 24 మండలాల నుంచి ప్రతి మండలానికి 5 ప్రాజెక్టులను ఎంపిక చేశారు. జిల్లాస్థాయిలో ఎంపికైన ఉత్తమ ప్రాజెక్టులను విజయవాడలోని లయోలా కాలేజీలో ఈ నెల 27, 28తేదీల్లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తారు. అనకాపల్లిలో నిర్వహించనున్న ఈ వైజ్ఞానిక ప్రదర్శనకు జిల్లా కలెక్టరు రవి సుభాష్ పట్టాన్‌శెట్టి చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ సమన్వయకర్తగా, డాక్టర్ ఎస్.ప్రేమ్‌కుమార్ పర్యవేక్షణలో ఏడీ–2 రవిబాబు ఆధ్వర్యంలో ఈ ప్రదర్శనను నిర్వహిస్తున్నారు.



వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

కమిటీల ఏర్పాటు

వైజ్ఞానిక ప్రదర్శనను పకడ్బందీగా నిర్వహించేందుకు నిర్వహణ కమిటీలను నియమించారు. రిజిస్ట్రేషన్, ఆహ్వాన కమిటీ, ప్రదర్శనా కమిటీ, ఫుడ్ కమిటీ, ప్రైజ్ డిస్ట్రిబ్యూషన్ కమిటీ, వసతి సౌకర్యాల కమిటీ, సాంస్కృతిక కార్యక్రమాల కమిటీ, క్రమశిక్షణ కమిటీ, మీడియా, జ్యూరీ కమిటీలను ఏర్పాటుచేశారు. ఇందుకోసం మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు, అనుభవజ్ఞులైన పాఠశాల సహాయకులను నియమించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రాజెక్టులను ఈ నెల 22వ తేదీన ఉదయం 7 గంటలకు జీవీఎంసీ ఉన్నపాఠశాల(మెయిన్)లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి.

ప్రయోగ పరీక్షలకు వేళాయె..!

- రేపటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్
- ఈ సారి నాన్ జంబ్లింగ్ విధానంలోనే
- ఉమ్మడి విశాఖ జిల్లాలో 207 కేంద్రాలు
- సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు


విశాఖ విద్య: ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలకు అంతా సిద్ధమైంది. సోమవారం ఒకేషనల్, ఈ నెల 26 నుంచి జనరల్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ ప్రారంభం కానున్నాయి. పరీక్షలు ఏప్రిల్ 7 వరకు జరగనున్నాయి. ఈ సారి నాన్ జంబ్లింగ్ విధానంలో పరీక్షలు నిర్వహిస్తున్న నేపథ్యంలో కేంద్రాలపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు జరగనున్నాయి. కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఇంటర్మీడియట్ ఆర్ఐవో కార్యాలయంతోపాటు, కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేశారు. కేంద్రాల్లోని చీఫ్ సూపరింటెండెంట్, ఇన్విజిలేటర్లతోపాటు, ఉన్నతాధికారులు సైతం పరీక్షలపై నేరుగా పర్యవేక్షణ చేయనున్నారు.

ప్రాక్టికల్స్‌కు 21,279 మంది

విశాఖపట్నంలో 126 కేంద్రాలు ఏర్పాటు చేయగా, ఇక్కడ ఎంపీసీ 11,079 మంది, బైపీసీ 2,655 మంది విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలకు హాజరవుతున్నారు. అదేవిధంగా అనకాపల్లిలోని 65 కేంద్రాల్లో ఎంపీసీ 4,187 మంది, బైపీసీ 1,575 మంది, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 16 కేంద్రాల్లో ఎంపీసీ 1,173 మంది, బైపీసీ 610 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు పూటలా ప్రయోగ పరీక్షలు జరుగుతాయి.

207 కేంద్రాల్లో నిర్వహణ

ప్రాక్టికల్స్ పరీక్షలు ఈ సారి నాన్ జంబ్లింగ్ విధానంలోనే జరుగుతున్నాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో 355 జూనియర్ కాలేజీలు నిర్వహిస్తుండగా, విద్యార్థుల సంఖ్య, వసతులు, అందుబాటులో ఉన్న ల్యాబ్‌లను దృష్టిలో ఉంచుకొని పరీక్షల కోసం 207 కేంద్రాలను ఏర్పాటు చేశారు. నాన్ జంబ్లింగ్ విధానంలో ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహిస్తుండటం, 153 ప్రైవేటు కాలేజీల్లో కేంద్రాలు ఏర్పాటు చేయడంతో ఇలాంటి చోట్ల పటిష్టమైన నిఘా పెట్టారు. ఇంటర్మీడియట్ మార్కుల ప్రాధాన్యత దృష్ట్యా ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీల్లో మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారు.



ప్రాక్టికల్స్‌కు సిద్ధమవుతున్న పెందుర్తిలోని ఒకేషనల్ కాలేజీ విద్యార్థులు

డీఎస్పీ సునీల్ బదిలీ

అనకాపల్లి టౌన్: అనకాపల్లి డీఎస్పీ బి.సునీల్‌ను బదిలీ చేశారు. ఆయనను డీజీపీ కార్యాలయానికి ఎటాచ్ చేసినట్లు జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు శనివారం తెలియజేశారు. దిశ పోలీస్ స్టేషన్ డీఎస్పీ మళ్ల మహేష్‌కు అనకాపల్లి డీఎస్పీగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

జాగరణ రాత్రులు



విద్యుత్ దీపాలంకరణలో మసీదు

విశాఖపట్నం: మహాశివరాత్రి పర్వదినంతోపాటు ముస్లింల షబే-మెహరాజ్ వేడుకను శనివారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. శివరాత్రి వేడుకల్లో భాగంగా భక్తులు రాత్రంతా జాగరణ చేశారు. అదే విధంగా షబే-మెహరాజ్ పురస్కరించుకొని మసీదుల్లో తెల్లవారుజాము వరకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మహ్మద్ ప్రవక్త దైవదర్శన యాత్ర చేసిన పుణ్యదినాన్ని షబే-మెహరాజ్‌గా ఖురాన్‌లో పేర్కొన్నట్టు మతగురువులు చెబుతారు. ఈ సందర్భంగా మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

నూకతాత పండగ చూతము రారండి!

- నేటి నుంచి భారీ స్థాయిలో తిరునాళ్లు
- రాజయ్యపేటలో ఘనంగా ఏర్పాట్లు
- రాష్ట్ర నలుమూలలతోపాటు, ఒడిశా నుంచి తరలిరానున్న మత్స్యకారులు



నూకతాత విగ్రహాలు



రాజయ్యపేటలో నిర్మించిన నూకతాత ఆలయం

నక్కపల్లి: మత్స్యకారుల ఆరాధ్య దైవం, గ్రామీణ జిల్లాలో ప్రసిద్ధి గాంచిన రాజయ్యపేట నూకతాత పండగను రెండు రోజులపాటు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఏటా ఈ పండగను శివరాత్రి పురస్కరించుకుని మత్స్యకారులు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తారు. ఆదివారం సాయంత్రం నుంచి భారీ స్థాయిలో తిరునాళ్లు ప్రారంభమవుతాయి. తీర ప్రాంతంలో అత్యంత ఘనంగా జరిగే పండగ కావడంతో మత్స్యకారులతోపాటు, ఇతర సామాజిక వర్గాలవారు, చుట్టుపక్కల గ్రామాలవారు వేల సంఖ్యలో తరలివస్తారు. పూర్వీకుల నుంచి మత్స్యకారులు నూకతాతను తమ కులదైవంగా భావిస్తారు. గ్రామంలో ప్రత్యేకంగా నూకతాత ఆలయాన్ని నిర్మించి విగ్రహాలను ఏర్పాటు చేశారు. శివరాత్రి అమావాస్య (సోమవారం) రోజున నూకతాత విగ్రహాలను సముద్ర స్నానానికి తీసుకెళ్తారు. స్నానం అనంతరం విగ్రహాలను పూజారులు ఆలయానికి తీసుకువస్తున్న సమయంలో రోడ్డుపై వందలాది మంది మత్స్యకారులు పడుకుంటారు. వారిపై పూజారులు దాటుకుంటూ వెళ్తారు. ఇలా వెళ్తే తమ కష్టాలు గట్టెక్కి కోరిన కోర్కెలు తీరుతాయనేది మత్స్యకారుల విశ్వాసం.

జంతుబలి నిషేధం....

గ్రామాల్లో గ్రామదేవతల పండగ సందర్భంగా కోళ్లు, మేకలు బలి ఇస్తారు. నూకతాత పండక్కి మాత్రం జంతుబలి నిషేధం. ఈ పండగ నాడు నెత్తురు కనబడతే నూకతాత అగ్రహం చెందుతాడని గ్రామస్తులు చెబుతున్నారు. పండ్లు, శనగపప్పు మాత్రమే నైవేద్యంగా సమర్పిస్తారు. ఏడాదికొకమారు జరిగే ఈ పండక్కి ఉద్యోగ, వ్యాపార, వత్తి రీత్యా ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారు, చేపల వేట కోసం పూరీ, పారాదీప్, శ్రీశైలం, నాగార్జున సాగర్, నందికొండ, మచిలీపట్నం, కాకినాడ వంటి ప్రాంతాలకు తాత్కాలికంగా వలస వెళ్లిన వారు రాజయ్యపేట చేరుకుంటారు. బంధువులు, స్నేహితులు రాకతో మత్స్యకారుల ఇళ్లన్నీ సందడిగా ఉంటాయి. ఈ పండగను తిలకించేందుకు చుట్టపక్కల ప్రాంతాల నుంచి వేలాది మంది తరలి వస్తారు. దీంతో గ్రామస్తులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భారీ విద్యుత్ దీపాలంకరణ ఏర్పాటు చేస్తున్నారు. వేలాది రూపాయల విలువైన బాణసంచా కాల్చడం ఈ పండగలో మరో ప్రత్యేకత. ఆదివారం సాయంత్రం నుంచి మంగళవారం ఉదయం వరకు గ్రామంలో తిరునాళ్లు సందడి నెలకొంటోంది. ఈ సందర్భంగా డాన్స్ బేబీ డాన్స్, మంగమ్మ కథ, వినాయక బుర్రకథ వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నక్కపల్లి సీఐ నారాయణరావు, ఎస్ఐ శిరీష ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

జననేతే మళ్లీ సీఎం కావాలి

బైక్ యాత్ర చేస్తున్న సీఎం జగన్ వీరాభిమాని

దాబాగార్డెన్స్: జననేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని ఆకాంక్షిస్తూ.. ఆయన అభిమాని హైదరాబాద్ నుంచి బైక్ యాత్ర చేపట్టి శనివారం విశాఖ చేరుకున్నాడు. పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గానికి చెందిన వీరబాబు ఖమ్మంలోని వజీర్ సుల్తాన్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చేశాడు. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ద్వారా ఇంజినీరింగ్ పూర్తి చేసిన ఆయన హైదరాబాద్‌లోని ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. 'ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు ఎంతగానో నచ్చాయి. అన్ని వర్గాల సంక్షేమానికి సీఎం జగన్ పెద్ద పీట వేస్తున్నారు. అందుకే మళ్లీ ఆయనే ముఖ్యమంత్రి కావాలి. వైఎస్సార్ తనయుడిగా ఆయనపై ఉన్న అభిమానంతో బైక్ యాత్ర చేపట్టా..' అని వీరాబాబు తెలిపాడు.



బైక్ యాత్ర సాగిస్తున్న వీరబాబు

కైలాస ద్వారంలో భారీ పరమశివుడు

రూ.3 లక్షలతో శివుని విగ్రహం ఏర్పాటు చేసిన కూలీ



నూతనంగా ఆవిష్కరించిన శివుని విగ్రహం

మునగపాక : అతనొక కూలీ. తండ్రి రిక్షా కార్మికుడు. పేదరికంలో జన్మించినా తాను తలంచిన మహత్తర కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించి అందరి మన్ననలు అందుకుంటున్నాడు. కైలాస ద్వారంలో మహాశివుని విగ్రహాన్ని నెలకొల్పి పరమశివునిపై తనకున్న భక్తిని, అనురక్తిని చాటుకున్నాడు. ఆ భక్తకన్నప్ప తను వేటాడిని మాంసాన్ని పరమశివుడికి నివేదిస్తే.. ఈ దినసరి కూలీ తన కష్టార్జితం రూ.3 లక్షలతో పరమేశ్వరుని భారీ విగ్రహాన్నే ప్రతిష్ఠించాడు. మండలంలోని నారాయుడుపాలెం గ్రామానికి చెందిన బాడితిబోయిన జగన్నాథరావు, అప్పలనరసమ్మల కుమారుడు నూకరాజు. జగన్నాథరావు రిక్షా కార్మికుడు కాగా నూకరాజు సీలింగ్ పనులు చేస్తూ కుటుంబ పోషణ సాగిస్తున్నాడు. నూకరాజుకు శివుడంటే పరమ భక్తి. దీంతో నారాయుడుపాలెం శ్మశాన వాటికలో శివ విగ్రహం నెలకొల్పాలనుకున్నాడు. అందుకు తన కష్టార్జితంలో రోజూ కొంత దాచుకున్నాడు. ఇలా దాచిన రూ.3 లక్షలతో 15 అడుగుల ఎత్తైన శివుని విగ్రహాన్ని తయారు చేయించాడు. మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా శనివారం విగ్రహాన్ని ఆవిష్కరించాడు. నూకరాజు దైవభక్తికి స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శివునికి ప్రీతికరమైన శివరాత్రి సందర్భంగా ఆవిష్కరించడం పట్ల నూకరాజును అభినందిస్తున్నారు.

పోలీసు కానిస్టేబుల్‌కు గాయాలు



తీవ్రంగా గాయపడ్డ కానిస్టేబుల్

పాయకరావుపేట : విధి నిర్వహణలో వున్న పోలీసు కానిస్టేబుల్ ఓ.కాశీ రోడ్డు ప్రమాదంలో గాయపడినట్టు ఎస్ఐ ఎస్.రమేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలివి. పట్టణంలో శుక్రవారం రాత్రి బీట్ డ్యూటీ చేస్తుండగా ఆదర్శనగర్ వద్ద తాను ప్రయాణిస్తున్న మోటారు బైక్‌ను నక్కపల్లి నుంచి తుని వైపు వెళ్తున్న ముగ్గురు వ్యక్తులు మోటారు బైక్‌తో బలంగా ఢీ కొట్టారు. దీంతో కానిస్టేబుల్ కాశీకి తలకు, కాళ్లకు బలమైన గాయలైనట్టు తెలిపారు. వెంటనే అతనిని 108 వాహనంలో విశాఖపట్నం కేర్ ఆస్పత్రికి తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

గిరి రైతుల శ్రేయస్సే ధ్యేయం

ముంచంగిపుట్టు: గిరి రైతుల శ్రేయస్సే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. మండలంలోని వనభసింగి పంచాయతీ కొత్తూరులో ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో అధ్వర్యంలో ఐదుగురు మిరియం రైతులకు 75 శాతం స్ప్రేసీ బోర్డులను శనివారం ఆమె అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరిపెల సీతమ్మ, వైస్ ఎంపీపీ సిరగం భాగ్యవతి, జర్రెల సర్పంచ్ నాయకం భాగ్యవతి, హార్టికల్చర్ అధికారులు పాల్గొన్నారు.

శంభో హరహర నమోనమో!

మహాశివరాత్రి పర్వదినాన ఊరూ వాడా అంతా శివనామస్మరణతో మార్మోగాయి. శివశివ శంకర.. భక్తవశంకర, హరహర మహాదేవ్ శంభో శంకర.. అంటూ భక్తుల ప్రార్థనలతో శైవ క్షేత్రాలు హోరెత్తాయి. అర్ధరాత్రి సమీపించిన తరుణంలో.. మహాలింగోద్భవ సమయాన భక్తుల నోట శివపంచాక్షరీ మంత్ర ఘోష మిన్నంటింది. మహన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, పంచామృతాభిషేకాలు, క్షీరాభిషేకాలతో శివాలయాలు శోభాయమానమయ్యాయి. రాత్రంతా ప్రత్యేక పూజలు, అభిషేకాలతో భక్తులు జాగరణ చేసి, స్వామి సేవలో పులకితులయ్యారు.

- శివనామ స్మరణం సర్వపాప హరణం
- తొలివేకువ నుంచే ఆలయాల వద్ద బారులు తీరిన భక్తజనం



కశింకోట వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శివలింగానికి పూజలు



కశింకోట గవరపేటలో ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలో భక్తుల పూజలు



సాధువుల గుడిలో శివలింగానికి పూజలు చేస్తున్న భక్తులు



వేల్పులవీధి కాశీవిశ్వేశ్వర దేవాలయంలో శివలింగానికి క్షీరాభిషేకం



శివరాత్రి పూజల్లో పాల్గొన్న భక్తులు



సిద్ధిలింగేశ్వర స్వామి దేవాలయంలో 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత దంపతులు



శారదానది ఒడ్డునున్న ఉమారామలింగేశ్వరుడిని దర్శించుకున్న దాడి రత్నాకర్ దంపతులు

అనకాపల్లిటౌన్ : అనకాపల్లి పట్టణ, మండలంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని శివాలయాలు శివనామస్మరణతో మారుమోగాయి. శనివారం తెల్లవారుజాము నుంచే ఆలయాలకు భక్తులు రాక మొదలైంది. వేల్పులవీధి శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి, కోటవీధి భోగలింగేశ్వరస్వామి, అరటిపళ్ల మార్కెట్ వద్ద సాధువుగుడి, శారదానది ఒడ్డున ఉమారామలింగేశ్వరస్వామి, చిన్నవీధిలోని చౌడేశ్వరీ దేవాలయం, మెయిన్‌రోడ్డు సిద్ధిలింగేశ్వరస్వామి, గవరపాలెం గౌరీపంచాయతన దేవాలయాలు శివనామ స్మరణతో హోరెత్తాయి. శనివారం తెల్లవారుజాము నుంచే పలు శివాలయాల్లో స్వామివారికి ఏకవార అభిషేకాలు, రుద్రాభిషేకాలు, దీపారాధన, రాత్రి 10 గంటల నుంచి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకాలు నిర్వహించారు.

- పట్టణంలోని లక్ష్మీదేవిపేట గ్రామంలో థాట్సాప్ లివింగ్ ఆశ్రమంలో పడాల అప్పారావు ఆధ్వర్యంలో 11 అడుగుల శివలింగానికి క్షీరపంచామృతాలు, పండ్ల రసాలు, పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులతో దేవాలయాలు కిటకిటలాడాయి.
- మెయిన్‌రోడ్డులో సిద్ధిలింగేశ్వరస్వామి ఆలయంలో 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత జానకీరామరాజు దంపతులు, శారదానది ఒడ్డున శ్రీ ఉమారామలింగేశ్వరస్వామిని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.
- మండలంలోని శీరంశెట్టివానిపాలెం, గోపాలపురం, మామిడిపాలెం, ఊడేరు, రాజుపాలెం, అక్కిరెడ్డివానిపాలెంలోని శివాలయాల్లో పూజల కోసం భక్తులు వేకువజాము నుంచే బారులు తీరారు.



సర్వాభరణ భూషిత సర్వమంగళాంబ



కశింకోటలోని త్రిపురాంతకస్వామి వారికి అభిషేకాలు

కశింకోట : మహాశివరాత్రి సందర్భంగా శనివారం మండలంలోని శైవ క్షేత్రాలు శివ నామస్మరణతో మారుమ్రోగాయి. కశింకోటలోని పురాతన సర్వమంగళాంబ సమేత త్రిపురాంతకస్వామి ఆలయాన్ని స్థానికులతోపాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులు వేకువ జాము నుంచే బారులు తీరారు. ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిపించారు. సాయంత్రం లింగ దీపార్చన, ఏకాదశ పూరక రుద్రాభిషేకం, ఏక వారాభిషేకాలు నిర్వహించారు. రాత్రి లింగోద్భవ పూజలు జరిపారు. సర్వ మంగళాంబను వెండి ఆభరణాలతో అలంకరించి పూజించారు. ఆలయ అర్చకుడు వి.శంకరం, వి.చిదంబరం, వి.కృష్ణల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. అన్న సమారాధన నిర్వహించారు.

- కస్పావీధి సాంబశివుని ఆలయంలో రుద్రాభిషేకం ఘనంగా జరిగింది. ఆలయ అర్చకుడు ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.
- గవరపేటలోని ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని మహిళా భక్తులు ఎక్కువగా దర్శించి పంచామృతాలు, జలాలతో వేద మంత్రాల నడుమ అభిషేకాలు నిర్వహించారు. అన్న సమారాధన చేశారు. ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు భీశెట్టి దుర్గానాగేశ్వరరావు ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి.
- స్థానిక వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలోని శివలింగానికి, వీరబ్రహ్మేంద్రస్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.
- వెదురుపర్తిలో వేంచేసిన స్వయం భూ రామలింగేశ్వరస్వామికి తొలి వేకువ నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- మండలంలోని అమీన్‌సాహెబ్‌పేటలో సాంబశివుని ఆలయం, బయ్యవరం, పేరంటాలపాలెం, నూతలగుంటపాలెం, సోమవరం, కన్నూరుపాలెం శివాలయాలు, తాళ్లపాలెం సంతలోని రామలింగేశ్వరస్వామి ఆలయం, బంగారయ్యపేటలోని బసవేశ్వరస్వామి ఆలయం, సాంబమూర్తి ఆలయం, ఉగ్గినపాలెంలోని ఉమా సోమేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.



శీరంశెట్టివానిపాలెంలో ప్రత్యేక అలంకరణలో శివలింగం



అనకాపల్లి వేల్పులవీధిలో మంచు శివలింగం

క్లుప్తంగా

బ్రహ్మకుమారీల ఆధ్యాత్మిక ప్రచారం



కశింకోటలోని శివాలయంలో ప్రచారం చేస్తున్న బ్రహ్మకుమారీలు

కశింకోట : స్థానిక శివాలయంలో బ్రహ్మకుమారీలు శనివారం ప్రచారం నిర్వహించారు. భక్తులకు ఆత్మ, పరమాత్మ గురించి వివరించారు. ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత పెరిగి, ఆరోగ్యవంతమైన జీవితం సాధ్యమవుతుందన్నారు. రాజయోగం, ధ్యానం ప్రాముఖ్యతను చార్టుల ద్వారా తెలిపారు. భక్తులు ఆసక్తిగా తిలకించారు.

వజ్ర కవచాలంకృతునిగా ధ్యాన వేంకటేశుడు



కశింకోటలో వజ్ర కవచాలంకరణలో ధ్యాన వేంకటేశ్వరస్వామి

కశింకోట : మహా శివరాత్రి సందర్భంగా ధ్యాన వేంకటేశ్వరస్వామిని వజ్ర కవచం, పూలమాలలతో అలంకరించి పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

కల్యాణ పోతురాజుబాబు ఉత్సవం నేడు

కశింకోట : మండలంలోని తీడ గ్రామంలో కల్యాణ పోతురాజుబాబు ఉత్సవం ఆదివారం నిర్వహించనున్నట్టు సర్పంచ్ చిరికి సత్యనారాయణ శనివారం తెలిపారు. ఏటా శివరాత్రి మరుసటి రోజు జరిగే ఈ ఉత్సవంలో భాగంగా ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం గుర్రపు పరుగు పందాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పోటీలో గెలుపొందిన గుర్రాల నిర్వాహకులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ బహుమతులుగా వరుసగా రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.7 వేలు, రూ.6 వేలు వంతున నగదు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఉత్సవం సందర్భంగా రాత్రి పలు సంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు. శనివారం రాత్రి పోతురాజుబాబు జాగరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శనివారం 7,980 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్	3,900	4,100
మొదటి రకం	3,320	3,600
రెండో రకం	3,060	3,450
మూడో రకం	2,950	3,050

అనకాపల్లి సినిమాలు

సార్	- రాజా
అమిగోస్	-సత్యనారాయణస్క్రీన్-1
క్యాంటమేనియా(3డీ)	-సత్యనారాయణస్క్రీన్-2
వినరో భాగ్యము విష్ణుకథ	-షిర్డిసాయి
క్యాంటమేనియా(3డీ)	-పర్తిసాయి
వీరసింహారెడ్డి	-వెంకటేశ్వర
శ్రీదేవి శోభన్‌బాబు	-శ్రీసత్య
వాల్తేరు వీరయ్య	- రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 91 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-13 యూనిట్లు , బీ పాజిటివ్-42 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-29 యూనిట్లు, ఓ నెగిటివ్-2 యూనిట్లు, ఏబీ పాజిటివ్ -4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 311 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న 206 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (9441108144)ని సంప్రదించవచ్చు.

ముత్యాలమ్మపాలెం తీరంలో ప్రత్యేక ఏర్పాట్లు



తీరంలో మహాశివుడు



భక్తులు పుణ్యస్నానాలు చేయడానికి అనువైన ముత్యాలమ్మపాలెం తీరం

పరవాడ : జాగరణ చేసే భక్తులు ముత్యాలమ్మపాలెం సముద్ర తీరంలో పుణ్య స్నానాలు ఆచరించడానికి వీలుగా ఉత్సవ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఆదివారం వేకువ జాము నుంచి పట్టణ, గ్రామీణ ప్రాంతాల భక్తులు వేలాదిగా తరలి వచ్చి తీరంలో పుణ్య స్నానాలు ఆచరించి సమీపంలో కొలువుదీరిన మహాశివుడిని దర్శించుకుంటారు. శివరాత్రి పురస్కరించుకొని ముత్యాలమ్మపాలెం తీరంలో శనివారం రాత్రి, ఆదివారం ఉదయం బుర్రకథ, రేలారేలారే వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు దుస్తులు మార్చుకోవడానికి ఏర్పాట్లు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చే భక్తులకు తాగునీరు, మజ్జిగ వంటి పానీయాలు అందించడానికి పలు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చాయి. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా సీఐ పెదిరెడ్ల ఈశ్వరరావు పర్యవేక్షణలో ఇద్దరు ఎస్‌ఐలు, 30 మంది సిబ్బందితో బందోబస్తును ఏర్పాటుచేశారు. స్నానాలు ఆచరించడానికి తరలివచ్చే భక్తులు గ్రామం మీదుగా కాకుండా సచివాలయం ఎదురుగా ఉన్న రహదారి మీదుగా ట్రాఫిక్‌ను మళ్లించడానికి చర్యలు చేపట్టామని సీఐ ఈశ్వరరావు చెప్పారు.

మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న శ్రీసత్యసాయి సేవా సంఘం

తుమ్మపాల : మహాశివ రాత్రి పర్వదినం సందర్భంగా వేల్పుల వీధి శ్రీకాశీవిశ్వేశ్వర ఆలయంలో ఘనంగా శివ పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా శ్రీసత్యసాయి సేవా సంఘం అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆలయానికి వచ్చే భక్తులకు మజ్జిగ అందించి, వారి దాహార్తిని తీర్చారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం



స్వామివారి రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న వానపల్లి కోటేశ్వరరావు

అనకాపల్లిటౌన్ : శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 29వ ఆరాధన మహోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం గవరపాలెం కామాక్షమ్మదేవి ఆలయం నుంచి ఉత్సవ విగ్రహాన్ని పుర వీధుల గుండా ఊరేగించారు. ఈ సందర్భంగా కామాక్షమ్మదేవి ఆలయ కమిటీ అధ్యక్షుడు వానపల్లి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో స్వామివారి ఆరాధన మహోత్సవం, మహాశివరాత్రి పురస్కరించుకుని విజయరామరాజుపేట రైల్వే అండర్ బ్రిడ్జి వరకూ ఊరేగింపు నిర్వహించారు. రాత్రి 10 గంటలకు వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ వేడుక జరిపారు. ఆదివారం మధ్యాహ్నం అన్నసమారాధన చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ గౌరవాధ్యక్షుడు ఎండపల్లి మోహన్ బ్రహ్మాజీ, శాశ్వత గౌరవాధ్యక్షుడు కోసూరి మన్మధరావు, ఆలయ ప్రధాన కార్యదర్శి సింహాద్రి కోటేశ్వరరావు, కోశాధికారి ఎం.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆపన్నుల సేవలోనే సంతృప్తి



సరస్వతికి చెక్కు అందిస్తున్న విజయ్‌కుమార్, స్టీఫెన్ ప్రసాద్

సబ్బవరం : అనాథలు, పేదలకు ఆపన్న హస్తం అందజేయనున్నట్టు రావలమ్మపాలెం గ్రేస్ ఆఫ్ గాడ్ చర్చి పాస్టర్ పి. విజయకుమార్ చెప్పారు. చర్చిలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి నెలా మండలంలోని నిరుపేదలు, ఒంటరి మహిళలు,వృద్ధులు,దివ్యాంగుల కనీస అవసరాలు తీర్చేందుకు సహాయ సహకారాలు అందించేందుకు నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ప్రమాదంలో కాళ్లు విరిగిపోయిన కోన సరస్వతితో పాటు వితంతువు కోమూజి సరస్వతికి రూ.10 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో పాస్టర్ స్టీఫెన్ ప్రసాద్, ఫాస్టర్ డేవిడ్ లివింగ్ స్టన్ తదితరులు పాల్గొన్నారు.

పాతపాటి సర్రాజు మృతి తీరనిలోటు

తుమ్మపాల : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే పాతపాటి సర్రాజు అకాల మరణం తీరని లోటని అనకాపల్లి రాజపుత్ర సమాజ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్రకార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్ అన్నారు. ఆయన మృతి పట్ల తీవ్రసంతాపం వ్యక్తం చేశారు. క్షత్రియ సంక్షేమ సంఘం ప్రతినిధులు దంతులూరి వెంకటజగన్నాథరాజు, మందపాటి జానకిరామరాజు, పెనుమత్స వెంకటేశ్వరరావు, గణపతిరాజు, పిన్నమరాజు శ్రీనివాసరాజు, కొప్పెర్ల సత్యనారాయణరాజు, చేకూరి సుధాకర్‌రాజు, ఉప్పలపాటి మధు, మంతెన లీలావతి సంతాపం తెలిపారు.

కోడిగంటి గోవిందరావుకు ఘన నివాళి



గోవిందరావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నేతలు

అనకాపల్లిటౌన్ : దివంగత మాజీ ఎమ్మెల్యే కోడిగంటి గోవిందరావు వర్ధంతి సందర్భంగా నెహ్రూచౌక్‌లోనున్న ఆయన విగ్రహానికి సీపీఐ జోనల్ కార్యదర్శి వై.ఎస్.భద్రం, జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్య్రోద్యమంలో జైలుకెళ్లి, అనంతరం విలువలతో కూడిన రాజకీయాలు నడిపిన గోవిందరావు చిరస్మరణీయుడన్నారు. సాగునీటి వనరులు, పోలవరం ప్రాజెక్టు, విశాఖ ఉక్కు సాధనకోసం తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి మహోన్నత వ్యక్తిగా చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు ఆర్.దొరబాబు, రెడ్డిపల్లి అప్పలరాజు, చెల్లూరు నాగరాజు, తాకాశి వెంకటేశ్వరరావు, మాధవరావు, బాలు గాడి, కనిశెట్టి సురేష్, కోరిబిల్లి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉర్సు ఉత్సవం



ఫాతెహా క్వాజా గరీబ్ నవాజ్ జెండాను ఆవిష్కరిస్తున్న ముస్లింలు

కోటవురట్ల: హజ్రత్ ఖ్వాజా గరీబ్ నవాజ్ ఔలియా వారి 811వ ఉర్సు ఉత్సవాన్ని స్థానిక ముస్లిం వీధిలో శనివారం వైభవంగా నిర్వహించారు. మసీద్ ఉస్మాన్ ఘనీ, నవ జవాన్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఈ సందర్భంగా మసీదు మౌలానా అజీమత్ రజా మాట్లాడుతూ గరీబ్ నవాజ్ ఔలియా వారి బోధనలు అనుసరణీయమన్నారు. అనంతరం గరీబ్ నవాజ్ జెండా ఆవిష్కరించారు. ఖురాన్ పఠనం అనంతరం ప్రసాద వితరణ జరిగింది. పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు

కోటవురట్ల : కె.వెంకటాపురంలో శనివారం పారిశుధ్య పనులు నిర్వహించారు. జెడ్పీ హైస్కూల్‌కు వెళ్లే రహదారి పక్కనే భారీగా చెత్త పేరుకుపోవడంతో సర్పంచ్ పైల శ్రీదేవి మంగా ఇందిర భవానీ చర్యలు తీసుకున్నారు. పేరుకుపోయిన చెత్తతో దుర్వాసన వస్తుండడంతో పాటు దోమలు వ్యాప్తి చెందడంతో స్థానికులు చేసిన ఫిర్యాదుతో తొలగింపు చర్యలు తీసుకున్నారు. పొక్లెయిన్‌తో చెత్తను తొలగింపజేసి బ్లీచింగ్ చల్లించారు. పారిశుధ్యం మెరుగుకు దోహదపడాలని సర్పంచ్ కోరారు.

పేకాట, కోడిపందెం స్థావరాలపై దాడి

పరవాడ: మడకపాలెం సమీపంలోని నిర్మానుష్య ప్రదేశంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై సీఐ పి.ఈశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం అర్ధరాత్రి పోలీసులు దాడులు జరిపారు. ఈ దాడుల్లో పేకాడుతున్న 13 మందిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.65 వేల నగదు స్వాధీనపర్చుకున్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఈశ్వరరావు చెప్పారు.

కోడి పందాలపై ..

ఈ.మర్రిపాలెం గ్రామ సమీపంలోని జీడి తోటల్లో శనివారం ఉదయం కోడి పందాలు ఆడుతున్నట్లు సమాచారం అందడంతో సీఐ ఈశ్వరరావు తన సిబ్బందితో దాడులు జరిపారు. కోడి పందాలు ఆడుతున్న 6 గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.2,300 నగదు, 4 కోడి పుంజుల్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతులు



విద్యార్థులకు ట్రోఫీతో పాటు నగదు బహుమతి అందజేస్తున్న, బాబూరావు తదితరులు

సబ్బవరం : తల్లిదండ్రులు లేని చిన్నారులతో పాటు ఎంతో మంది పేద పిల్లలను అక్కున చేర్చుకుని ప్రయోజకులుగా తీర్చిదిద్దేందుకు డాన్ బోస్కో నవ జీవన్ సొసైటీ కృషి చేస్తుందని అనకాపల్లి జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు భరణికాన బాబూరావు అన్నారు. దేవీపురంలోని డాన్ బోస్కో నవజీవన్ సొసైటీలో నిర్వహించిన క్రికెట్ టోర్నీ విజేతలకు శనివారం బహుమతులు పంపిణీ చేశారు. ఎరునాయుడుపాలెం జట్టుకు ట్రోఫీతో పాటు రూ.3 వేలు, రెండో స్థానంలో నిలిచిన డాన్ బోస్కో నవ జీవన్ సొసైటీ విద్యార్థులకు ట్రోఫీతో పాటు రూ.2 వేలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నారపాడు సర్పంచ్ మామిడి శంకరరావు, అసకపల్లి సర్పంచ్ కర్రి నరసింగరావు, ఫాదర్ కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

శతశాతం ఫలితాలకు 'పది'ంతల కృషి



స్టడీ అవర్స్‌లో టెన్త్ విద్యార్థులు, పర్యవేక్షిస్తున్న సబ్జెక్టు ఉపాధ్యాయులు

తుమ్మపాల : పదో తరగతి పరీక్షలు సమీపిస్తుండటంతో విద్యార్థులు పుస్తకాలతో కుస్తీ ముమ్మరం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉదయం, సాయంత్రం సమయాల్లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. పది పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత లక్ష్యంగా మండల విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. చదువులో వెనుకబడిన విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహించి తమ సబ్జెక్టులపై పట్టు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. ఈ ఏడాది ప్రభుత్వ కేటగిరీలో టెన్త్ పరీక్షలకు మండలం నుంచి సుమారు 2,300 మంది విద్యార్థులు హాజరుకానున్నారు.

రోజూ రివిజన్ పరీక్షలు

పదో తరగతి విద్యార్థులకు డిసెంబర్ నాటికే సిలబస్ పూర్తయింది. ప్రస్తుతం విద్యార్థులందరికీ పాఠశాల సమయం కంటే అదనంగా ఉదయం ఓ గంట, సాయంత్రం ఓ గంట ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. వీటి ద్వారా అన్ని సబ్జెక్టులను చాప్టర్ల వారీగా రివిజన్ చేయిస్తున్నారు. వీటిపై సంబంధిత సబ్జెక్టు ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించి వారి సామర్థ్యాన్ని అంచనా వేస్తున్నారు. ఎందులో వెనుకబడి ఉన్నారో.. వాటిని మరోసారి వారికి అర్థమయ్యేలా బోధిస్తున్నారు. మండలంలోని అన్ని పాఠశాలల్లోనూ నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారు.

స్టడీ అవర్స్‌తో ఆత్మవిశ్వాసం

ఏప్రిల్ 3వ తేదీ నుంచి పది పబ్లిక్ పరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వం షెడ్యూల్ ఖరారు చేసిన విషయం తెలిసిందే. ఈ ఏడాది నుంచి 7 ప్రశ్నాపత్రాలతోనే పరీక్షలు నిర్వహించనున్నారు. సైన్స్ సబ్జెక్టులో ఫిజికల్ సైన్స్, బయాలజీ రెండు పేపర్లయినప్పటికీ, ఒకే రోజు రాయాల్సి ఉంటుంది. ఈ మేరకు ఇప్పటికే మోడల్ ప్రశ్నాపత్రాలతో పరీక్షలను నిర్వహించారు. మరోవైపు స్టడీ అవర్స్‌ను ప్రయివేట్/కార్పొరేట్ స్థాయిలో నిర్వహిస్తున్నారు. దీంతో సందేహాలున్న అంశాలను అప్పటికప్పుడే నివృత్తి చేసుకునే వెసులుబాటు కలిగి, పిల్లల్లో ఆత్మవిశ్వాసం బాగా పెరిగిందని ఉపాధ్యాయులు చెప్తున్నారు. మరోవైపు పరీక్షల ఒత్తిడిని తగ్గించేందుకు, తట్టుకునేలా చేసేందుకు నిపుణులతో ప్రత్యేక అవగాహనా సదస్సులు కూడా నిర్వహిస్తున్నారు.

100 శాతం ఉత్తీర్ణతే లక్ష్యం



ప్రభుత్వ పాఠశాలల్లో టెన్త్ ఉత్తీర్ణత 100 శాతం వచ్చేలే ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి అదనంగా తరగతులు నిర్వహిస్తున్నాం. అన్ని పాఠశాలల్లోనూ స్టడీ అవర్స్ పక్కాగా జరుగుతున్నాయి. మంచి ఫలితాలు సాధించేందుకు సమిష్టిగా కృషి చేస్తున్నాం.

– డి.దివాకర్, ఎంఈవో, అనకాపల్లి మండలం

కోళ్ల పందాలపై పోలీసుల దాడి

ఎస్.రాయవరం : పెనుగొల్లు ధర్మవరం సమీపంలో కోళ్ల పందాలపై దాడులు చేసి ఐదుగురు వ్యక్తుల నుంచి మూడు కోళ్లు, 12 బైకులు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ ప్రసాద్ రావు శనివారం తెలిపారు. ముందస్తు సమాచారంతో సిబ్బందితో వెళ్లి ఈ దాడులు నిర్వహించినట్టు తెలిపారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేశామన్నారు.